ప్రజాశక్తి

శనివారం 12 ఏప్రిల్ 2025 | 5 | విజయనగరం



15 నుంచి చేపల వేట నిషేధం

ప్రజాశక్తి-భోగాపురం

సముద్ర జలాల్లో మెకనైజడ్, మోటారు బోట్లు ద్వారా నిర్వహించు అన్ని రకాల చేపలు వేటను ఈనెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మత్స్యశాఖ అధికారి నిర్మలా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్‌లో చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్ర మత్స్యసంపద సుస్థిరతను సాధించడం ఈ నిషేధ ఉద్దేశమని తెలిపారు. సముద్ర జలాలలో యాంత్రిక పడవలు (మెకనైజడ్ మరియు మోటారు బోట్లు) పై మత్స్యకారులు ఎటువంటి చేపలవేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించి చేపల వేట నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సచివాలయాల కుదింపే లక్ష్యం



- సిబ్బంది సర్దుబాటుకు ఆదేశాలు జారీ
- సగానికి తగ్గనున్న సచివాలయాలు?

సచివాలయ వ్యవస్థను తగ్గించడమే కూటమి ప్రభుత్వంగా కనిపిస్తోంది. రానున్న కాలంలో ఉన్న సచివాలయాల సంఖ్యను 50 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు కేటగిరిల కింద సచివాలయ వ్యవస్థను మారుస్తూ సిబ్బంది సర్దుబాటుకు ఆదేశాలు ఇవ్వడం అందుకు నిదర్శనంగా ఉంది. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వం మొత్తం సచివాయాలను మూడు కేటగిరిలుగా విభజిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయాల్లో పనిచేసే వివిధ శాఖల ఉద్యోగులను సర్దుబాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2500 జనాభా ఉన్న సచివాలయాలకు ఇద్దరు, 2501 నుంచి 3500 జనాభా వరకు ఉన్న సచివాలయాలకు ముగ్గురు సిబ్బందిని, అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు నలుగురు సిబ్బందిని కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సచివాయాల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసులను ఉంచనున్నారు. మిగతా వారిని శాఖల వారీగా సర్దుబాటు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో అడ్మిన్ కార్యదర్శితో పాటు నలుగురే ఉంటారని తెలుస్తోంది. వార్డు సచివాలయాల్లో కొత్త నియామాకాలను చేపట్టకుండా ఉన్న సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా సచివాలయల సంఖ్యను దాదాపు 30 శాతం వరకు తొలుత తగ్గించనున్నారు. తర్వాత మరో 8 నెలలు కాల వ్యవధిలో ఈ సంఖ్యను 50శాతం చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తుంది.

సెక్టార్ పరిధిలోకి రెండు

మున్సిపాల్టీలలో దాదాపు 40నుంచి 50శాతం వరకు సచివాలయాలు తగ్గనున్నాయి. ఇప్పటికే కొంతమంది వేరే ఉద్యోగాల్లోను, మరికొంత మంది దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. ఇప్పటి వరకు పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉద్యోగులను గత ప్రభుత్వం కొనసాగించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల వ్యవస్థపై సమీక్ష చేసి పట్టణాలు, నగర ప్రాంతాల్లో 8 వేల మందికి ఒక సచివాలయం ఉండాలని ప్రతిపాదించింది. మొత్తం ఎ, బి, సి కేటగిరిలో విభజించి ప్రస్తుతం ఉన్న సిబ్బందిని కుదించి మిగతా వారిని శాఖల వారీగా నర్దుబాటు చేయనున్నారు. సర్దుబాటు ద్వారా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్ గా వీరిని విభజించాలనేది ప్రతిపాదనకు అనుగుణంగా మార్పులు చేయనున్నారు. రెండు సచివాలయాలు ఒక సెక్టార్ కిందకు తీసుకొని రానున్నారు. ప్రస్తుతానికి ఒక సెక్టార్ లో రెండు సచివాలయలు ఉన్నాయి. ఉద్యోగులు పదోన్నతులు, లేదా సర్దు బాటు వలన పోస్టులు తగ్గితే కొన్నాళ్ళు తర్వాత సెక్టార్ లో ఉండే రెండు సచివాలయాలను ఒకటిగా చేసి, రెండింటినీ విలీనం చేయనున్నారు. దీంతో ప్రస్తుతం విజయనగరం నగర పాలక సంస్థలో ఉన్న 61 సచివాలయాలు రానున్న కాలంలో 30 నుంచి 35 సచివాలయాల తగ్గిపోనున్నాయి.

నవసమాజ స్థాపనకు పూలే బాటలు

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి
- 400 మందికి రుణాలు పంపిణీ



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, తూర్పుకాపు చైర్‌పర్సన్ యశస్వి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

200 ఏళ్ల క్రితమే నవ సమాజ స్థాపనకు బాటలు వేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావుపూలే 199వ జయంతి వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా కలెక్టరేట్ సమీపంలోని పూలే, సావిత్రిబాయి విగ్రహాలకు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జయంతి సభ నిర్వహించారు. పూలే చిత్రపటానికి అతిధులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ సమాజంపై చెరగని ముద్ర వేసిన ఆ మహనీయుడు పుట్టిన 199 ఏళ్ల తరువాత కూడా, స్మరించుకోవడం పూలే గొప్పదనానికి నిదర్శనమని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కంటే ముందే నవ సమాజ సాధనకు పూలే పునాది వేశారని అన్నారు. ఆయన ఆలోచనలు, కృషి ఫలాలు నేటి తరం అందుకుంటోందని చెప్పారు. పూలే సహధర్మచారిని సావిత్రిభాయి పూలే స్త్రీవిద్యకోసం పాటుపడ్డారని చెప్పారు. వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే పూలే దంపతులకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పూలే భవన నిర్మాణానికి, అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర తూర్పుకాపు చైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ పూలే ను భారత సామాజిక విప్లవోద్యమ పితగా పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, మహిళల హక్కులు, వారి విద్యకోసం విశేష కృషి చేశారని కొనియాడారు. వారి విలువలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా సుమారు 400 మంది బిసిలకు రుణాలను, ఉపకరణాలను పంపిణీ చేశారు. పూలే ఏకపాత్రాభినయాన్ని అద్భుతంగా ప్రదర్శించిన ప్రముఖ కళాకారుడు ఆర్‌బి రామానాయుడును సత్కరించారు. అంతకుముందు వివిధ బిసి సంఘాల నాయకులు ముద్దాడ మధు, వై.శంకర్రావు, విజయలక్ష్మి, గొలగాని రమేష్, కిల్లంపల్లి ఆచారి తదితరులు మాట్లాడుతూ జ్యోతిరావు గొప్పదనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు, ఎబిసిడబ్ల్యూఒలు, సంక్షేమాధికారులు, జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎస్‌పి వకుల్ జిందాల్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆధునిక వైతాళికుడు పూలే

దేశ ఆధునిక వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పునరంకితమవుదామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఆర్ఒ సింహాచలం, ఉద్యోగ సంఘం అధ్యక్షులు నర్సింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి చెల్లించాలని
ఎండిఎం కార్మికుల వినతి



డిఇఒకు వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు, ఎండిఎం కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి ఉన్న బిల్లులు, గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడుకు మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, యూనియన్ నాయకులు టి .లక్ష్మి మాట్లాడుతూ నేటికి నాలుగు నెలలుగా బిల్లులు, జీతాలు, చెల్లించకపోతే పిల్లలకు ఎలా వండి పెట్టాలని ప్రశ్నించారు. విద్యా సంవత్సరం చివరి కావడంతో ఇప్పటికే కిరాణా షాపుల్లో వేలల్లో బకాయిలు ఉన్నాయని, అప్పులు చేసి తీరుస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్‌లో మెనూ ఛార్జీలు 5వ తరగతి లోపు పిల్లాడికి ఐదు రూపాయల 88 పైసల నుంచి 6:19 పైసలకు, ఎనిమిదో తరగతి లోపు పిల్లాడికి 8.57 నుంచి 9.26పైసలకు పెంచుతూ కేంద్రం ప్రకటించిందని, అందుకు అనుగుణంగా 2024 నవంబర్ నుంచి నూతన మెనూ కూడా అమలు చేస్తున్నారని, కానీ పాత రేట్లే బిల్లులు చేస్తున్నారు. కొత్తగా పెరిగిన మెనూ రేట్లు చెల్లించడం లేదని తెలిపారు. కనీసం పదివేల రూపాయలు నెలకు వేతనం ఇవ్వాలని రెండు జతల యూనిఫామ్ కాటన్ దుస్తులు, ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో స్వప్న, లక్ష్మి మంగ, నారాయణమ్మ, ధనలక్ష్మి ,హేమ తదితరులు పాల్గొన్నారు.

యూత్ బాక్సింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

9వ యూత్ బాయ్స్ జిల్లా బాక్సింగ్ ఎంపికలు స్థానిక రాజీవ్ స్టేడియంలో శుక్రవారం జరిగాయి.జిల్లా యూత్ మెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సెలక్షన్లలో సుమారు 30 మంది పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలురు 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు, ఈనెల 12న విశాఖపట్నం రైల్వే గ్రౌండ్‌లో జరగబోవు 7వ రాష్ట్రస్థాయి యూత్ బాయ్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు జిల్లా అధ్యక్షులు, గరి. శ్రీనివాసరావు, కార్యదర్శి ఇందుకూరి అశోక్ రాజు, ఆర్గనైజర్ సెక్రెటరీ ఎస్ఇ రాజు, డిఎస్ఎ, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు , బాక్సింగ్ రింగ్ అఫిషియల్స్ వి. సంతోష్ కుమార్, పి. శ్రీనివాసరావు కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క గింజా కొనలేదు!

అపరాలు పంట కొనుగోలు విషయంలో అన్నదాతకు అన్యాయం జరుగుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారుగా నెలరోజులు దాటిపోతున్నా, జిల్లాలో ఒక్క గింజను కూడా అధికారులు కొనుగోలు చేయలేదు. ఫలితంగా అపరాలు అమ్ముకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు వ్యాపారులు పంటను కారు చౌకగా కొనుగోలు చేస్తున్నారు.

- అపరాల కొనుగోలులో రైతుకు అన్యాయం
- పంట మొత్తం దళారులకే



రైతు ఇంట్లో ఉన్న అపరాల బస్తాలు

ప్రజాశక్తి - జామి

జిల్లాలో ప్రధాన సాగుగా ఉన్న వరి పంట తర్వాత ప్రతి రైతు ఆపలరాల పంటలైన పెసర, మినుములు, ఉలవల పంటలను పండిస్తారు. అందులో భాగంగానే ఏటా జిల్లాలో సుమారుగా 37వేల ఎకరాల్లో అపరాలు సాగవుతాయి. ఇందులో కొంత భాగాన్ని రైతులు విత్తనాలకు, సొంత వినియోగానికి ఉపయోగించు కొని మిగిలిన బాగాన్ని అమ్ముకుంటారు. గత రెండు నెలల క్రితం నుంచి రైతు సంఘం అపరాలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పోరాడగా, ఎట్టకేలకు ప్రభుత్వ అధికారులు జిల్లాలో జామి (విజినిగిరి), గజపతినగరం, గంట్యాడ, సంతకవిటి, బొబ్బిలి ఇలా ఐదు చోట్ల అపరాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ నెల రోజులైనా జిల్లాలో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయ లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పొమ్మనలేక పొగ

అపరాల పంటలకు ప్రభుత్వం పెసర పంటకు క్వింటాకు రూ. 8,600, మినుములు క్వింటాకు రూ. 7,400 మద్దతు ధర ప్రకటించింది. అయితే కొనుగోలు కొసం వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లయి వంటి పలు శాఖల అధికారులను కొనుగోలు కమిటీగా పెట్టి, కొనుగోలు బాధ్యతను మార్క్‌ఫెడ్ కు అప్పగించింది. కొనుగోలు చేయాలంటే రైతు సేవా కేంద్రంలో నమోదు చేయనుకోవాలని మెలికపెట్టడంతో కొంత కాలం సైట్ ఒపెన్ కాలేదని, ఈ క్రాప్‌లో నమోదు కాలేదని రకరకాల కారణాల తో కొనుగోలు జాప్యం చేస్తూ వస్తున్నారు. ఇన్సూరెన్స్ రాదని ఇలా లేనిపోని సాకులతో రైతులు నేరుగా దళారులను ఆశ్రయించేలా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేక కొంత మంది తక్కువ ధరకు అమ్ముకోగా, ఇప్పటికే 90శాతం రైతులు ప్రైయివేటుకు అమ్మేసినట్లు సమాచారం.

గతంలోనూ ఇదే అనుభవం..

గతంలోనూ అపరాలు కొనుగోలులో రైతులను ప్రభుత్వం మోసం చేసింది. జామి, గంట్యాడ మండలాల్లో గత సారి ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పి, రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా కొనిపించి, వాటిని ప్రయివేటుకు అమ్మి ధర రాలేదని మోసం చేసిన ఉదంతాలు ఉన్నాయి. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయని రైతులు అంటున్నారు.

తక్షణమే కొనుగోలు చేయాలి

ఇప్పటివరకు ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇప్పటికైనా తక్షణమే రైతుల నుంచి పంట కొనుగోలు చేయాలి. ఇప్పటికే జాయింట్ కలెక్టర్ దృష్టిలో పెట్టాం. ప్రభుత్వ మద్దతు ధర అందేలా కొనుగోలు చేస్తేనే రైతుకు మేలు.

- బుద్ధరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

83 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

జిల్లాలో ఇప్పటి వరకు 83 మంది రైతులు పంట అమ్ముకోవడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరి వద్ద 53 మెట్రిక్ టన్నులు పంట సిద్ధంగా ఉంది. అయితే ఎన్‌సిసిఎఫ్ వారు ఈ- పంట కొనడానికి వస్తున్నారు. త్వరలోనే పంట నాణ్యత ప్రమాణాల బట్టి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

- ఎన్.వెంకటేశ్వర్రావు, మార్క్ ఫెడ్ డిఎం

అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

భారత వాయుసేన లో అగ్నివీర్ వాయు (మ్యుజిషియన్) ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ 21.04.2025 నుండి 11.5.2025 వరకు https://agnipathvayu.cdac.in వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వారియొక్క అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకొని అగ్నివీర్ వాయు ర్యాలీ నకు హాజరయ్యే తేదీ, సమయం పొందాలని తెలిపారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పూల్‌బాగ్‌లోగల ప్రభుత్వ బధిరుల ఆశ్రమపాఠశాలలో చెవిటి మూగ బాల, బాలికల ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జె.దయానంద ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికేటు, పుట్టిన తేది సర్టిఫికేటు, కులధ్రువీకరణ పత్రం, పాఠశాల బదిలీ సర్టిఫికేటుతో రైస్/రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు పాస్ పుస్తకం మొదటి పేజీ జిరాక్సు కాపితో పాఠశాలను సంప్రదించాలని తెలిపారు. 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. 1వ తరగతిలో చేరుటకు 6నుండి 8సంవత్సరాల వయసు ఉండాలని పేర్కొన్నారు. ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, హాస్టల్, భోజన వసతి, యూనిఫారం వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఎలాంటి ప్రవేశరుసుం గాని డొనేషన్లు గాని లేవని తెలిపారు.



జెండాను ఎగురవేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం

కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని కునుకువానివలసలో శుక్రవారం ఆలిండియా కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువు వద్ద రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం ఎగుర వేశారు. బ్రిటిష్ పాలకులు, భూస్వాములకు వ్యతిరేకంగా అప్పటిలో పోరాటం చేశారని, నేడు రైతు సంఘం రైతుల సమస్యలపై పోరాటం చేస్తుందని చెప్పారు. రంగరాయపురంలో రైతు సంఘం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యు.ప్రసాద్, రెడ్డి త్రినాధ, రైతులు పాల్గొన్నారు.

పింఛన్లపై రాద్ధాంతం తగదు

ఎమ్మెల్యే కళావెంకట రావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

పింఛన్లపై వైసిపి నాయకులు రాద్ధాంతం చేయడం తగదని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పింఛను రూ. 4వేలుకి పెంచి, 3నెలల బకాయిలతో కలిపి రూ. 7వేలు అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రూ.2వేలు పింఛన్ రూ.3వేలు చేయడానికి వైసిపి ప్రభుత్వానికి ఐదు సంవత్సరాలు పట్టిందన్నారు. వైసిపి నాయకులు ఉనికిని కాపాడుకోవడానికి ర్యాలీలు, ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. కొత్త పింఛన్ల మంజూరు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అన్నారు. త్వరలోనే ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

రూ.21.13 కోట్లతో
ఎస్‌సి యువతకు ఉపాధి

అంబేద్కర్ జయంతి నుంచి అమలుకు శ్రీకారం ● కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూపొందించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.21.13 కోట్లతో 509 యూనిట్ల ఏర్పాటుకు షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ రూపొందించిన ప్రణాళికను అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14నుంచి అమలుకు శ్రీకారం చుడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ రుణ ప్రణాళికలో యూనిట్లు ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రూ.1174.76 లక్షల మొత్తాన్ని రుణాల రూపంలో బ్యాంకుల ద్వారా అందించనున్నామని, సబ్సిడీ రూపంలో రూ.832.64 లక్షలు అందజేయనున్నామని, లబ్దిదారుని వాటాగా రూ.105.65 లక్షలు వుంటుందన్నారు. షెడ్యూల్డు కులాల యువత ఉపాధి కల్పనకు 32 రకాల స్వయంఉపాధి పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందించనున్నట్టు పేర్కొన్నారు. ఒక్కో లబ్దిదారునితో రూ.2.50 నుంచి రూ.20 లక్షల వరకు విలువగల యూనిట్లను ఈ పథకాల ద్వారా ఏర్పాటు చేయించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వివిధ రకాల స్వయంఉపాధి అవకాశాలను పొందేందుకు జిల్లాలోని నిరుద్యోగ ఎస్‌సి యువత మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో https://apobmms.apcfss.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న స్వయంఉపాధి అవకాశాలను పొందేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవానలి తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై సర్వే

ప్రజాశక్తి వార్తకు స్పందన



కబ్జా చేసిన భూమిని పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ భూమి కబ్జా శీర్షికన శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. కమిషనర్ నల్లనయ్య ఆదేశాలు మేరకు టౌన్ ప్లానింగ్ ఎసిపి ఐవి రమణమూర్తి ఆధ్వర్యంలో టిపిఒ అప్పలరాజు, టౌన్ సర్వేయర్ సింహాచలం కెఎల్ పురం సర్వే నెంబర్ 165లో ఉన్న భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఎంత ఉందో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎసిపి రమణమూర్తి మాట్లాడుతూ సర్వే చేసిన తర్వాత కమీషనర్ ఆదేశాలు ప్రకారం ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. సర్వేలో మండల రెవెన్యూ అధికారి,సచివాలయ సిబ్బంది, వార్డు కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పారాది వంతెన పనులు పరిశీలన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే బేబినాయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణంతో తమ కుటుంబానికి ఎంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. తమ తాత శ్వేతచలపతి రామకృష్ణ రంగారావు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఆఖరి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన వంతెన ఇప్పటివరకు ఎంతో దృఢంగా ఉందన్నారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా ఇప్పుడు బలహీన పడిందన్నారు. ఇప్పటివరకు ఉన్న వంతెన తమ తాత నిర్మిస్తే, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వంతెన తన సోదరుడు సుజయ్‌కృష్ణ రంగారావు మంజూరు చేయించగా, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూపుదాల్చడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణంలో నాణ్యత పరంగా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అధికారులు చెబుతున్నట్లు కంగారుగా సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో కాకుండా, పూర్తి నాణ్యతతో నిర్మాణ పనులు చేసి నవంబర్ నాటికి వంతెన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రతినిధి ఎ.భాస్కరరావు, కాంట్రాక్టర్ పానకాలరావు, ఆర్‌అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్షను ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షలకు 127 మంది, ఇంటర్‌లో ప్రవేశాలకు 76 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఐదో తరగతికి ఆదివారం ఉదయం 10 గంటలకు, ఇంటర్‌కు అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ద్రోన్ల వినియోగంలో సహకరించాలి

సెంచూరియన్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజుతో కలెక్టర్ భేటి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వ్యవసాయం, ఉద్యాన వనాల అభివృద్ధిలో ద్రోన్ల వినియోగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. శుక్రవారం సెంచూరియన్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు కలెక్టర్‌తో భేటి అయ్యారు. సెంచూరియన్ యూనివర్సిటీలో చేపడుతున్న కోర్సుల వివరాలను, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ గురించి ఛాన్సలర్ కలెక్టర్ కు వివరించారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయంలో అమలు చేస్తోన్న కోర్సులు , నైపుణ్య శిక్షణలు, సీడాప్ ఒప్పందం గురించి వివరించారు. ప్రస్తుతం ఇంజినీరింగ్, పారామెడికల్, అగ్రికల్చర్, మేనేజ్మెంట్ కోర్సులు నిర్వహిస్తోన్నమని వాటితోపాటు యువతకు శిక్షణనిచ్చేందుకు అన్ని రకాల నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ త్వరలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా యువతకు నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ద్రోన్లతో వ్యవసాయం ఇతర రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ తాను త్వరలో విశ్వవిద్యాలయాన్ని సందర్శిస్తానని చెప్పారు. వ్యవసాయం లో, ప్రస్తుతం మామిడి పంట ఉన్నందున తెగుళ్ల నివారణ కు ద్రోన్ల ద్వారా కషి చేయాలని కోరారు. అనంతరం డిఆర్ఓ శ్రీనివాస మూర్తిని కలిశారు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిఎస్ఎన్ రాజు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

రక్తదానం.. ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రశాంత్ కుమార్ మహంతి అన్నారు. శుక్రవారం సెంచూరియన్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్ సన్నీ డయాల్, శ్రావణి, జోగినాయుడు, ఎన్‌సిసి అధికారి సతీష్, ప్రభుత్వ వైద్యులు షేక్ అహ్మద్, ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు కౌన్సిలర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సహకారం మరువలేం

బదిలీ అయిన జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

పోలీసుశాఖకు జిల్లా న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి అందించిన సహకారం మరువలేనిదని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. జిల్లాలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా పని చేస్తూ ఇటీవల గుంటూరు జిల్లాకు బదిలీ బి.కళ్యాణ చక్రవర్తిని క్రవారం ఎస్‌పి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన సేవలను కొనియాడి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతంగా పని చేశారన్నారు. పోలీసు, న్యాయ శాఖలు సమన్వయంతో పనిచేసి, పలు కేసుల్లో నిందితులు శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టారన్నారు. పోలీసుశాఖతో సమన్వయంతో పని చేస్తూ, మంచి సహకారాన్ని అందించారని ఆయన సేవలను కొనియాడారు. గుంటూరు జిల్లాలో కూడా సమర్ధవంతంగా పని చేసి, న్యాయశాఖ ప్రతిష్టను మరింతగా ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు.

కళ్లాలకు రోడ్డు మంజూరు చేయాలి

ఎమ్మెల్సీకి రైతుల వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామ రైతులు కళ్లాలకు రోడ్డు మంజూరు చేయాలని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు వినతి అందించారు. గ్రామంలో సుమారు 30 కళ్లాలు ఉన్నాయని, 40 ఏళ్లుగా వాటికి వెళ్లేందుకు సరైన మార్గం లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏదో ఒక గ్రాంట్‌లో రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వబ్బిన సతీష్, గోవింద, పిల్లా నాగరాజు, కూనిశెట్టి సత్తిబాబు, సోంబాబు, నాగరాజు, ఏడువాక రవికుమార్, బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులను విచారిస్తున్న డిఎస్‌పి వీరా కుమార్

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని గుడివాడ గ్రామంలో శుక్రవారం డిఎస్‌పి వీరాకుమార్ అట్రాసిటీ కేసులో విచారణ చేపట్టారు. గత నెలలో వేణుగోపాలస్వామి తీర్థం సందర్భంగా జరిగిన వివాదంపై వల్లంపూడి ఎస్ఐ బి.దేవిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఇదివరకు చేపట్టిన విచారణలో ఫిర్యాదుదారులు అందుబాటులో లేకపోవడంతో రెండోసారి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుల నుంచి సమాచారం సేకరించారు. కార్యక్రమంలో శృంగవరపుకోట రూరల్ సిఐ అప్పలనాయుడు, వల్లంపూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై విఆర్ఎల వినతి

ప్రజాశక్తి-రాజాం

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం స్థానిక తహశీల్దార్ కృష్ణంరాజుకు ఆ సంఘం నాయకులు వినతి అందించారు. ఈ సందర్భంగా విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు పి.దాలయ్య, కార్యదర్శి ఎం.వెంకటి, దుర్గారావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పేస్కేల్ అమలు చేయాలని, నామినీలను రెగ్యులర్ విఆర్ఎగా గుర్తించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పి.దాలయ్య, బి.దుర్గారావు, ఎం.వెంకటి, సిహెచ్. అప్పయ్యమ్మ, నీలవేణి, టి.కృష్ణారావు, శ్రీను, కుమార్, గవరయ్య పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని లింగంపేట గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి మాట్లాడుతూ 48 మంది రైతులకు చెందిన 50 దూడలు ప్రదర్శనలో పాల్గొన్నట్లు చెప్పారు. ఆరోగ్యంగా సరైన సంరక్షణ ఉన్న మూడు దూడలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భీమాలి, మల్లివీడు, పశు వైద్యాధికారులు సత్యనారాయణ, తులసి, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తొలగింపు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని సాగునీటి కాలువల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికలు తొలగింపు చేపడుతున్నట్లు ఎపిఒ లక్ష్మీపతిరాజు తెలిపారు. రానున్న ఖరీఫ్‌లో సాగునీరు పంట పొలాలకు అందేలా పనులు చేపడుతున్నట్లు వివరించారు. పారాది, పెంట, భోజరాజపురం, కొత్తపెంట, ఎం.బూర్జవలస, అలజంగి, గొల్లపల్లి, రంగరాయపురం తదితర గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. కాలువల్లో పిచ్చిమొక్కలు, పూడికలు తొలగించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి రోజుల సంరక్షణతో

బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-మెరకముడిదాం

వెయ్యి రోజుల సంరక్షణతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు నిండు నూరేళ్ల జీవితాన్ని ఇవ్వవచ్చునని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని గర్భాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారం, ఆరోగ్య విద్య తప్పకుండా, గృహ సందర్శన చేయడం ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎం అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.పద్మ, జి.భారత మాత, జి.శైలజ, కళావతి, ఉమా, చిన్నతల్లి, ఎఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశా వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని బుదరాయవలస, కొత్తకర్ర గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ జి.భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. మస్తర్ల పరిశీలన అనంతరం అయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయం ఆరు గంటలకే పనికి హాజరైతే పది గంటలకు వెళ్లిపోవచ్చునని తెలిపారు. పని ప్రాంతంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరిగా ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలిపారు.

జీవనోపాధులపై అవగాహన

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని ఆర్.ఆమదాలవలసలో శుక్రవారం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్రెడిట్‌కార్డు, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి, ఎపిఎం బి.గోవిందరావు అవగాహన కల్పించారు. సంఘాలలో పదో తరగతి, ఆపైన చదువుకున్న సభ్యులను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి, వారి ద్వారా వార్షిక రుణ ప్రణాళికలు తయారు చేయించారు. ఈ ప్రణాళికలో గత రుణ చరిత్ర, ఎటువంటి కార్యక్రమాలకు వినియోగించుకున్నది, దాని ద్వారా ఆదాయం ఎంత వస్తున్నది వంటి వివరాలు తెలుసుకున్నారు.

మజ్జిగ పంపిణీ

విజయనగరం టౌన్ : స్థానిక కొత్త గవరవీధి రామమందిరం వద్ద విజయనగరం వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాహితీవేత్త కట్టమూరి చంద్రశేఖరమ్ శిబిరాన్ని ప్రారంభించారు. అధ్యక్షులు కుప్పూరావు, కార్యదర్శి టి.సత్యమూర్తి, కార్యనిర్వాహక సభ్యులు పి.వి.రామారావు, వై.వీర్రాజు, బసవమూర్తి, సోషల్ వర్కర్ బి గోపాలం, ఎమ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

1110 కేజీల ప్లాస్టిక్ పట్టుకున్న ప్రజారోగ్య.సిబ్బంది

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై ఆకస్మిక దాడులు నిర్వహించిన ప్రజారోగ్య సిబ్బంది 1,110 కేజీల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, తన సిబ్బందితో కలిసి నగరంలో వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం పిడబ్ల్యు మార్కెట్ లో ఉన్న ప్లాస్టిక్ దుకాణాల వద్దకు వెళ్లి నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలను గుర్తించి మొత్తం 1,110 కేజీల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకొని మధురవాడ లో ఉన్న జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో తాము కృషి చేస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు అనధికారికంగా ప్లాస్టిక్ విక్రయాలను సాగిస్తున్నారన్నారు. దీంతో ఆకస్మిక దాడులు చేపట్టాలని ఆదేశించడంతో 1,110 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకొని, ఎనర్జీ ప్లాంట్ కు తరలించామన్నారు. దాడుల్లో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, అంజిబాబు,రవి శేఖర్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీతంలో రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

మాజీ ఎంపి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని సామాజిక బాధ్యతగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు మొత్తం 100 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు, ప్రిన్సిపాల్ ఎ.రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, డీన్ నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని కొండగండ్రేడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుమల మెడికవర్ ఆస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన శిబిరాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ ప్రారంభించారు. సుమారు 250 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పి.కనకరాజు, కూటమి నాయకులు మునకాల ఆదినారాయణ, సన్యాసినాయుడు, ఆకుల మహేష్, కె.వి.నాయుడు, మాధవరావు, నాగేశ్వరావు, గణేష్, పైడిరాజు పాల్గొన్నారు.

పినతాడివాడలో అన్నదానం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడలో శుక్రవారం అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా 2500 మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బడ్డుకొండ మణిదీప్ నాయుడు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ ఎంపిటిసి కె.ఆదిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. పట్టణంలో రైతుబజార్ సిసి రోడ్డు, డ్రెయిన్లు, గాంధీ నగర్ రెండోలైన్‌లో రోడ్లు, డ్రెయిన్లు, ముంతాజ్ హోటల్ పక్కన సిసి రోడ్డు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు. సంతగౌరమ్మపేటలో సిసి రోడ్లు, డ్రెయిన్లు, పోతనపల్లిలో సైడ్ కాలువలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఆరోగ్య పరిరక్షణ, ప్రసూతి సౌకర్యాలపై ప్రతి తల్లీ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అచ్యుతకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా చేపడుతున్న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని డాక్టర్ రాజేష్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని గర్భిణులు, బాలింతలకు ఆమె అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన ప్రాథమిక సూత్రాలను తెలియజేశారు. వైద్యాధికారి రాజేష్‌వర్మ.. ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, పథకాలను వివరించారు. తల్లిపాల ఆవశ్యకతను డాక్టర్ ప్రమీలదేవి తెలియజేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు పోషకాహార స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ మహేశ్వరి, సూపర్వైజర్ ఉమాపతి, హెల్త్ విజిటర్ నానమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి, రాజేశ్వరి, శైలజారాణి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన


నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి-విజయనగరం

సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డితో పాటు మరికొంతమంది జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం జర్నలిస్టులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కు జిల్లా జర్నలిస్టుల సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘల నాయకులు కె.రమేష్‌నాయుడు, పిఎస్ఎస్‌వి ప్రసాదరావు, పంచాది అప్పారావు, కొల్లూరు జగన్నాథ శర్మ, వైఎస్. పంతులు, ఎంఎస్ఎన్ రాజు, సాక్షి బ్యూరో ఇంచార్జీలు అల్లు సూరిబాబు, సాక్షి టీవీ బ్యూరో ఎ.యుగంధర్, పలువురు సాక్షి విలేకరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొత్తగా ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తులను తహశీల్దార్లు సకాలంలో పరిష్కరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూకరాజు ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ వివిఆర్ జగన్నాథరావుతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు అంశాలపై సూచనలు చేశారు.

ఫారం-6, 7, 8 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో, బిఎల్ఒలకు అందజేసినా వాటిని నమోదు చేయడంతో పాటు సకాలంలో వాటిని విచారించి, పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్ఒల ద్వారా ఎప్పటికప్పుడు నివేదికలు, పెండింగ్ అంశాలు తెప్పించుకొని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. బిఎల్ఒలు సక్రమంగా పనిచేయకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


సర్పంచ్ రామును అభినందిస్తున్న నాయకులు

పాలవలస సర్పంచ్‌గా రాము

ప్రజాశక్తి-గుర్ల

పాలవలస సర్పంచ్‌గా వల్లూరు రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ పొట్నూరు కనకమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఉప సర్పంచ్‌గా ఉన్న వల్లూరు రాము శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ సమక్షంలో సర్పంచ్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లూరు రాము మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు సహకరించాలని కోరారు. అనంతరం సర్పంచ్‌ను ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

'అవంతి'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని బసవపాలెం సమీపంలోని అవంతి రీసెర్చ్ అండ్ టెక్నాలజికల్ అకాడమీలో హైదరాబాద్‌కు చెందిన టెక్ మహేంద్ర కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. బిటెక్ చివరి ఏడాది చదువుతున్న 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 60 మందిని ఎంపిక చేశారు. వీరికి రూ.3 లక్షలు చొప్పున ప్యాకేజీ ఇవ్వనున్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో ప్రిన్సిపల్ పి.గోవిందరావు, అవంతి కళాశాలల ప్రతినిధి ముత్తంశెట్టి మహేష్, వైస్ ప్రిన్సిపల్ కె.భాస్కరరావు, ఎఒ జి.అశోక్ కుమార్, ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కర్రోతుకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎఎంసి చైర్మన్‌గా నియమితులైన టిడిపి నాయకులు కర్రోతు వెంకట నర్సింగరావుకు ఆపార్టీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కర్రోతు దంపతులకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి శారదాంబ

మే 10న లోక్‌అదాలత్

ప్రజాశక్తి-రాజాం

మే పదో తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ కోరారు. శుక్రవారం రాజాం కోర్టు ఆవరణలో పోలీస్, రెవెన్యూ, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీ, బ్యాంకు న్యాయవాదులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రాజీయే రాజమార్గమని, రాజీకి వీలైన ఎక్కువ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.రామనాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఆర్ఇహెచ్ జయదేవ్, సీనియర్ న్యాయవాదులు ఆర్.రామ్మూర్తి, ఎజిపి ఎస్.పోలారావు, పట్టణ సిఐ కె.అశోక్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలు, ఎల్ల మహేశ్వరరావు, రేగిడి ఎస్ఐ పి.నీలావతి పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి


భోగాపురం.. నివాళులర్పిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు


నెల్లిమర్లలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని


రాజాం.. పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు రాజేష్


చీపురుపల్లిలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న వైసిపి నాయకులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఎస్‌విఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణంలోని శ్రీవెంకటరమణ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. దీనికి కారకులైన కళాశాల ఎఒ గేదెల రామునాయుడు, అధ్యాపకులను వెంకటరమణ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ


మృతిచెందిన నాగ సత్యలక్ష్మి

మండలంలోని చౌడమ్మ అగ్రహారం వద్ద జాతీయ రహదారి బ్రిడ్జిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రాజమండ్రిలోని దివాన్‌చెరువు ప్రాంతానికి చెందిన నంబూరు నాగ సత్యలక్ష్మి (27) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త భార్గవ్‌రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... బైక్ రైడర్ భార్గవ్ రాజా, నాగ సత్యలక్ష్మి శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై రాజమండ్రి నుంచి విహారయాత్రకు రోడ్డు మార్గంలో నేపాల్ బయల్దేరారు. ఉదయం 11 గంటల సమయంలో జాతీయ రహదారిపై అదుపు తప్పి వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి అక్కడికక్కడే మరణించింది. భార్గవ్ రాజాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, రాజాను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సిహెచ్‌సికి తరలించారు. పూసపాటిరేగ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

6 కేజీలు గంజాయి పట్టివేత

విజయనగరం కోట : నగరంలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పక్కన ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఒక వ్యక్తి గంజాయి విక్రయించడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అతడిని పట్టుకున్నారు. సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రామగణేష్ ఆదేశాలతో సిబ్బంది దాడి చేసి ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా లాటింగి గ్రామానికి చెందిన ముకుంద బహర్‌దలైను అదుపులోకి తీసుకొని అతడి నుంచి 6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుండి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని కెత్తన్నపేట పంచాయితీ రేవళ్లపాలెం దగ్గర్లో పేకాట శిబిరంపై శుక్రవారం ఎస్ఐ నవీన్ పడాల ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి 14 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,632 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.